




www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

శుక్రవారం । 29 । మే । 2026


# ఆందోళనొద్దు.. అండగా ఉంటాం

- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
- ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు

యాదాద్రి భువనగిరి /అక్షిత బ్యూరో:

రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్నీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతుల పక్షాన ప్రభుత్వం నిలుస్తుందని, ఎలాంటి ఆర్థిక పరిస్థితులు వచ్చినా ధాన్యం సేకరణ ఆపబోమన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని

మిగతా 2లో..





గద్వాల వస్త్రానికి ఖండాంతర ఖ్యాతి

# సంస్కృతికి ప్రతీక గద్వాల చీర



గద్వాల, అక్షిత న్యూస్:

తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల్ ప్రాంతం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది "గద్వాల చీర". భారతీయ చేనేత సంప్రదాయంలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ చీరలు కేవలం వస్త్రాలు మాత్రమే కావు; అవి కళ, సంప్రదాయం, సంస్కృతి, నైపుణ్యం, కుటుంబాల జీవనాధారం అన్నీ కలిసిన గొప్ప వారసత్వం. "గద్వాల చీర" పేరు దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, విదేశాల్లో కూడా ఖ్యాతి గడించింది. గద్వాల చీరల ఆవిర్భావం

గద్వాల చీరల చరిత్ర దాదాపు 300 సంవత్సరాలకు పైబడినదిగా చెబుతారు. అప్పటి గద్వాల సంస్థానం పాలకులు చేనేత కళను ప్రోత్సహించారు. ముఖ్యంగా మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ కాలంలో నేత కళాకారులకు విశేష ఆదరణ లభించింది.

గద్వాల ప్రాంతంలోని పద్మశాలి, దేవాంగ, స్వకులశాలి, కుర్ని, తొగుట, జాంధ్ర తదితర నేత కుటుంబాలు తమ సంప్రదాయ నైపుణ్యంతో చీరల తయారీలో ప్రత్యేకత సాధించాయి. మొదట రాజ కుటుంబాల కోసం మాత్రమే నేసిన ఈ చీరలు తరువాత సాధారణ ప్రజల్లోనూ ప్రాచుర్యం పొందాయి.

## గద్వాల చీరల ప్రత్యేకత ఏమిటి?...

గద్వాల చీరలను ఇతర చీరలతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెట్టే అంశాలు ఎన్నో ఉన్నాయి.

### 1. పట్టు అంచు - పత్తి మధ్యభాగం

గద్వాల చీరలో ప్రధాన ప్రత్యేకత "కాటన్ బాడీ– సిల్క్ బోర్డర్". చీర మధ్య భాగం పత్తితో ఉండగా, అంచులు మరియు పల్లూ పట్టుతో తయారవుతాయి. ఈ మేళవింపే గద్వాల చీరలకు ప్రత్యేక అందాన్ని ఇస్తుంది.

మిగతా 2లో..

- జూన్ 2న పంపిణీకి చర్యలు
- కలెక్టర్ బి.చంద్ర శేఖర్

# నెలాఖరులోగా డబుల్ ఇళ్ల పూర్తి

మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:

మిర్యాలగూడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ అన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ గుమస్తాల కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. జూన్ 2 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన అన్ని



మిగతా 2లో..

# లాటీలు... తూటాలకు బలి!



2లో..

# సంస్కృతికి ప్రతీక గద్వాల చీర

(మొదటి పేజీ తరువాయి)

### 2. కుట్టు (జాయింట్ లాక్) నైపుణ్యం

పత్తి మరియు పట్టును కలిపే ప్రత్యేక నేసే విధానాన్ని కుట్టు (జాయింట్ లాక్)" అంటారు. ఇది అత్యంత క్లిష్టమైన కళ. చేతితో నేసే ఈ ప్రక్రియకు ఎంతో ఓపిక, నైపుణ్యం అవసరం.

### 3. జరీ పనితనం

పురాతన కాలంలో స్వచ్ఛమైన వెండి, బంగారు జరీలను ఉపయోగించేవారు. అందుకే గద్వాల చీరలు రాజసాన్ని ప్రతిబింబిస్తాయి.

### 4. తేలికైన చీర

"గద్వాల చీరను మాచిస్ (అగ్గిపెట్టెలో) పెట్టెలో మడిచిపెట్టొచ్చు" అనే మాట ప్రసిద్ధి చెందింది. అంత తేలికగా, మృదువుగా ఈ చీరలు ఉంటాయి.

### ఆలయ కళల ప్రభావం

గద్వాల చీరల అంచుల్లో, పల్లూలో కనిపించే డిజైన్లు దక్షిణ భారత ఆలయ శిల్పకళ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. దేవాలయ గోపురాలు, పూల డిజైన్లు, సంప్రదాయ ఆకృతులు చీరలకు మరింత అందాన్ని ఇస్తాయి. దేశ విదేశాల్లో గుర్తింపు

గద్వాల చీరలు భారత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ సంపాదించాయి. వివాహాలు, పండుగలు, ప్రత్యేక వేడుకల్లో గద్వాల చీరలకు ప్రత్యేక స్థానం ఉంది. అంతే కాకుండా అమెరికా, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల్లో నివసించే భారతీయులు కూడా గద్వాల చీరలను ఎంతో ఇష్టపడు తున్నారు.

### భౌగోళిక గుర్తింపు

గద్వాల చీరలకు భారత ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు మంజూరు చేసింది. ఇది గద్వాల చీరల ప్రత్యేకతకు అధికారిక గుర్తింపు. ఈ గుర్తింపు వల్ల ప్రపంచవ్యాప్తంగా గద్వాల చీరలకు మరింత ప్రాధాన్యం పెరిగింది.

### నేతన్నల కష్టం

ఒక గద్వాల చీర నేయడానికి రోజుల నుంచి వారాల వరకు



సమయం పడుతుంది. డిజైన్ క్లిష్టతను బట్టి నెలరోజులు కూడా పట్ట వచ్చు. కానీ నేతన్నలకు సరైన ఆదాయం అందకపోవడం బాధాకరం.

ముడి సరుకుల ధరలు పెరగడం, యంత్రాల తయారీ చీరల పోటీ, మధ్యవర్తుల దోపిడీ కారణంగా చాలామంది నేత కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

### ఆధునిక కాలంలో మార్పులు

ఇప్పటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా గద్వాల చీరల్లో కొత్త డిజైన్లు, ఆధునిక రంగులు, ఫ్యాషన్ శైలులు ప్రవేశించాయి. అయినప్పటికీ సంప్రదాయ నేసే కళను కాపాడేందుకు నేత కళాకారులు కృషి చేస్తున్నారు. ఆన్‌లైన్ మార్కెట్లు రావడంతో గద్వాల చీరలు ప్రపంచవ్యాప్తంగా మరింత చేరువయ్యాయి.

### గద్వాల చీర - తెలంగాణ గర్వకారణం

గద్వాల చీర కేవలం వస్త్రం కాదు; అది తెలంగాణ సంస్కృతి ప్రతీక. నేతన్నల చెమట, కళ, సంప్రదాయం, కుటుంబ జీవన పోరాటం అన్నీ కలిసిన కళాఖండం.

ఈ కళను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా నేత కుటుంబాలకు అండగా నిలబడాలి. గద్వాల చీరలను కొనుగోలు చేయడం అంటే ఒక సంప్రదాయాన్ని నిలబెట్టడం అనే భావన సమాజంలో పెరగాలి.

# ఆందోళనొద్దు.. అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. వరి ధాన్యం రికార్డు స్థాయిలో దిగుబడి రావడంతో సేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు.రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గోదాములకు ధాన్యం తరలింపులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఇసుక వాహనాలను ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ కోసం వినియోగించు కోవచ్చున్నారు.

రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్‌లో వరి పంట అద్భుతంగా వచ్చిందన్నారు. మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో భారీ మొత్తంలో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైతుల పక్షాన ప్రభుత్వం ఉందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు



చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు.ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# నెలాఖరులోగా డబుల్ ఇళ్ల పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులతో కోరారు. అనంతరం మిర్యాలగూడ ఆర్‌డీఓ కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్ష నిర్వహించారు.

జూన్ 2న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నందున సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులు, తాగునీటి ట్యాపులు,



విద్యుత్ సౌకర్యాలు, కిటికీలకు గ్లాసులు, బాత్రూములు, ట్రాన్స్‌ఫార్మర్, స్ట్రీట్ లైట్లు తదితర అన్ని పనులను పూర్తి చేసి అప్పగించాలని, ఈ నెల 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.పార్కులు, వాటర్ ప్లాంట్లు, గదుల శుభ్రత, సానిటేషన్, మరుగుదొడ్లు, మొక్కల నాటడం, మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు, పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు.ప్రతి ఇంటికి నీటి ట్యాపులు, ఎలక్ట్రికల్ లైన్లు, పంప్ హౌస్‌లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

అలాగే గుంతల రోడ్ల మరమ్మతులు మూడు రోజుల్లో పూర్తి చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి లైన్లు పూర్తిచేయాలని, తాగునీటి ట్యాంకులను పూర్తిగా శుభ్రం చేయించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కరెంట్, ఫ్యాన్లు, బోర్డుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,ఆర్డీవో రమణారెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, హౌసింగ్ డిఇ శ్రీనివాస్, పంచాయతీ డిఈ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామకృష్ణ కలెక్టర్ వెంట ఉన్నారు.

# లాఠీలు... తూటాలకు బలి!

- నాడు కలలు కల్లలు
- నేడు రేవంత్ సర్కార్ సాకారం
- ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలి
- తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళన కరపత్రం విడుదల
- హాజరైన మాజీ మంత్రి మోత్కుపల్లి
- తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి




**వనపర్తి, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పింఛన్, గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని కలలు కన్నామని కలలు కలగానే మిగిలిందని తెలిపారు. తెలంగాణ కోసం పోలీసుల లాఠీలకు బలైంది ఉద్యమకారులే అని అన్నారు. అప్పుడు పెట్టిన కేసులకు ఇప్పటికి కొంత మంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈనెల 21న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ లో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహిస్తామని పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. అంతకంటే ముందుగా వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో జూన్ 21న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం కరపత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముంజగళ్ళ విజయ్, బిఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, ముపురి కుమార్, మీసాల మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

శుక్రవారం । 29 । మే । 2026



## త్యాగం, దానగుణానికి ప్రతీక బక్రీద్

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**కాజిపేట్, అక్షిత ప్రతినిధి:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గురువారం ఉదయం బొక్కల గడ్డలోని ఈద్గా మైదానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అందరితో ఆత్మీయంగా ముచ్చటిస్తూ బక్రీద్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే కోరుకున్నారు.

## నూతన ఎస్సై రాములు యాదవ్‌ని కలిసిన బీఎస్పీ మండల అధ్యక్షుడు

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** తాడూర్ మండలం నూతన ఎస్సైగా భాద్యతలు స్వీకరించిన రాములును తాడూర్ మండల బిఎస్పీ అధ్యక్షుడు జన్ను ఆంజనేయులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ




సందర్భంగా అయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. ఎలాంటి అవాంఛనియా ఘటన లు జరగకుండా కాపాడుతనని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమం బిఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గలో మజ్జిగ పంపిణీ

**కాశీబుగ్గ,అక్షిత న్యూస్:** వరంగల్ నగరంలోని, కాశిబుగ్గలో వంగరి పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాగి జావా పంపిణీ దాత గుప్తా. ఈ కార్యక్రమానికి ప్రముఖ కాశీబుగ్గ నోటరీ అడ్వకేట్ మార్త సత్యనారాయణ, రన్ న్యూస్ వరంగల్ రిపోర్టర్ నల్ల మహేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి బాటసారులకు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం




జరిగింది. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం అధ్యక్షులు వంగరి జయ ప్రకాష్, సహాయ కార్యదర్శి , వంగరి వేణుగోపాల్, కోశాధికారి వంగరి రవి,చిమ్మని వేణు, గోషికొండ రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.





# కరీంనగర్ రేకుర్తి ఈద్గాలో ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

**పాల్గొన్న సీపీ గౌష్ ఆలం**

**ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ కమిషనర్**

**కరీంనగర్,అక్షిత బ్యూరో:** త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే ముస్లింల పవిత్ర పండుగ 'బక్రీద్' "ఈద్-ఉల్-అజ్హా వేడుకలు "కరీంనగర్ నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక రేకుర్తిలోని ప్రధాన ఈద్గా వద్ద గురువారం ఉదయం జరిగిన పవిత్ర ప్రత్యేక ప్రార్థనల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు.

ఈద్గాకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ప్రార్థనల అనంతరం సీపీ గౌష్ ఆలం ముస్లిం సోదరులందరికీ ఆలింగనం చేసుకుని, బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సమాజంలో శాంతి, సోదరభావం, కరుణను మరింత పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. నగరంలో పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తరపున అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కి, ఈద్గా వద్ద విధుల్లో ఉన్న ట్రైనీ ఐపిఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రూరల్ ఏసీపీ విజయ కుమార్, కొత్తపల్లి ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సీపీ కూడా విధుల్లో ఉన్న సిబ్బందిని అభినందిస్తూ, వారికి పండుగ శుభాకాంక్షలు అందజేశారు. నగరంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు పకడ్బందీగా నిర్వహించిన అధికారులను ఆయన అభినందించారు.




## కరీంనగర్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**48 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు**

**1,479 వాహనాల తనిఖీ 60 నంబర్ ప్లేట్ లేని వాహనాలు గుర్తింపు**

**115 చలానాలు విధింపు , తనిఖీలను స్వయంగా పరిశీలించిన సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణ కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి పోలీసులు ముమ్మర నాఖాబంది వాహనాల తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన ఈ తనిఖీలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.




బుధవారం అర్ధ రాత్రి నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీలలో మొత్తం తనిఖీ చేసిన వాహనాలు: 1,479" డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు" 48 మందిపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

"నంబర్ ప్లేట్ లేని వాహనాలు" నంబర్ ప్లేట్ సరిగ్గా లేని 60 వాహనాలను గుర్తించారు.

"చలానాలు" ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను 115 చలానాలు విధించారు. తనిఖీలకు నగర ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం కోరారు.



## అచ్చంపేట నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు ఆర్థిక శుభాకాంక్షలు

**- అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ**

**అచ్చంపేట, అక్షిత ప్రతినిధి:**

బక్రీద్ వదిన సందర్భంగా ముస్లిం సోదరులు నమాజ్ అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ముస్లిం సోదరులకు ఆర్థిక శుభాకాంక్షలు తెలపడం జరిగింది. అదేవిధంగా లింగాల మండలం అంబటిపల్లి గ్రామంలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు. అమ్రాబాద్ మండల పరిధిలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొండలాగుల. గ్రామంలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. లింగాల మండల కేంద్రంలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అచ్చంపేట ఐఎన్‌టియుసి తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణని కల్వడం జరిగినది అచ్చంపేట పురపాలక మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్ గ్రంథాలయ రాజేందర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజిత మల్లేష్ మాజీ ఎంపీపీ రామనాథం ఉపమహేశ్వర టెంపుల్ చైర్మన్ మాధవరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి అచ్చంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుజ్జి రా ములు లాలు యాదవ్ సుంకరి బాలరాజ్ ఉమామహేశ్వర్ డైరెక్టర్ పవన్ కుమార్ ఐఎన్‌టిసి మండల అధ్యక్షుడు మౌలానా యూత్ కాంగ్రెస్ నాయకులు నరసింహ నాయక్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.







# త్యాగానికి ప్రతీకగా బక్రీద్..

### సోదరభావానికి ప్రతీకగా ఖుర్బానీ.....!

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే మసీదులు ప్రార్థనలతో మార్మోగగా, నగరాలు, గ్రామాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతున్నాయి. చిన్నారులు కొత్త దుస్తుల్లో సందడి చేస్తూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండుగ శుభాకాంక్షలు పంచుకుంటున్నారు.

పవిత్ర నమాజ్ అనంతరం మత పెద్దలు ఖుర్బానీ యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) అల్లాహ్ ఆజ్ఞకు లోబడి తన కుమారుడిని కూడా త్యాగం చేయడానికి సిద్ధపడిన సంఘటనను గుర్తు చేశారు. అదే త్యాగస్ఫూర్తికి గుర్తుగా ముస్లింలు ఖుర్బానీ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఖుర్బానీ అనేది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదని, మనలోని అహంకారం, స్వార్థం, చెడు ఆలోచనలను త్యజించి మానవత్వంతో జీవించాలని ఇస్లాం ఇచ్చే గొప్ప సందేశమని ఉలేమాలు తెలిపారు. ఖుర్బానీ చేసిన మాంసాన్ని పేదలు, అనాథలు, అవసరమైన వారితో పంచుకోవడం ద్వారా సమాజంలో సమానత్వం, ప్రేమ, సోదరభావం పెరుగుతుందని వివరించారు.

పండుగ సందర్భంగా మార్కెట్లు రద్దీగా మారగా, దుస్తులు, స్వీట్లు, పండుగ సామగ్రి కొనుగోళ్లతో వ్యాపార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. భద్రతా దృష్ట్యా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి శాంతియుత వాతావరణంలో పండుగ జరగడానికి ఏర్పాట్లు చేశారు.

త్యాగం, సేవ, ప్రేమ, మానవత్వం అనే విలువలను ప్రపంచానికి చాటిచెప్పే బక్రీద్ పండుగను ప్రజలు ఐక్యతా భావంతో ఘనంగా జరుపుకోవడం విశేషం.




# ముస్లీంల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

### మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించాం..

### ముస్లీంలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి..

**జగిత్యాల అక్షితబ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ముస్లీంల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఈద్గా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లీంల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమా లను అమలు చేస్తుందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజక వర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు



కేటాయించినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నట్లు మంత్రి వివరించారు. ధర్మపురి నియోజకవర్గంలో 10వ తరగతి, ఇంటర్ పూర్తి అయిన యువతి, యువకుల స్వయం ఉపాధి కోసం రూ. 2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటు న్నామని మంత్రి తెలిపారు.



ఆసక్తి కలిగిన యువతి, యువకులు రుణాలు పొంది స్వయం ఉపాధి పొందాలని మంత్రి అడ్లూరి కోరారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల ఆకలి తీరుస్తున్న ఉచిత అన్నదాన కేంద్రాలు

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** సరస్వతి అంత్య పుష్కరాలకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.. ఎండలు విపరీతంగా కొడుతుండడంతో త్రాగునీటికి, భోజనానికి భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు..పుష్కరాలకు విచ్చేసిన భక్తుల కోసం ఆలయ అధికారులు అన్నదాన సత్రం వద్ద ఉచిత అన్నదానం



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పుష్కర స్నానాల అనంతరం భక్తులు ఆహార సమస్యలు ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రత్యేకంగా అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి రోజు భక్తులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారు..దేవస్థానం సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో అన్నదానం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నదానంలో పరిశుభ్రత, నాణ్యతపై ఆలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈఓ మహేష్ సూచించారు. ప్రతిరోజు ఉచిత అన్నదానం కార్యక్రమం జరుగుతుందని, దీనిని భక్తులు ఉపయోగించుకోవాలన్నారు.. కాళేశ్వరం వచ్చే భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఆలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు..

# సిద్దాపూర్ జోలికొస్తే ఉద్యమం తప్పదు..

### దంపు కంపుపై ఊక దంపుడు ఉపన్యాసాలు ఆపాలి..

### తక్షణమే ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి..

### -ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నరసింహ మాదిగ

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** ఎక్కడినుండో చెత్తను సేకరించి మా ప్రాంతంలో వేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో భారీ చెత్త డంప్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన తీవ్రంగా ఖండించి మాట్లాడారు. కొత్తూరు పారిశ్రామిక వాడ కావడంతో మండల వ్యాప్తంగా ఇప్పటికే తీవ్ర వాయు కాలుష్యం రాజ్యమేలుతోందని ఇప్పుడు డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపడితే ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. పరిశ్రమలు



అని.. ఉపాధి అని.. చివరికి రైతుల పొట్ట కొట్టి భూములు లాక్కున్నారని ఇప్పుడు.. ఆ భూముల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం సిగ్గుచేటు అన్నారు.

పరిసర గ్రామాలలో ఉన్న ప్రజలను ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భారీ ఎత్తున ఆందోళనకు తమ సిద్ధమని ప్రకటించారు..

# రైతుల సంక్షేమం కోసం పనిచేయాలి

**అధికారులకు అదనప కలెక్టర్ సూచన**

**షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**

**వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** రైతుల సౌకర్యార్థం అవసరమైన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డును అదనపు జిల్లా కలెక్టర్ చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో సమావేశమై, తడిసిన ధాన్యం విషయంలో రైతులకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అదనంగా, డీఎం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ , జిల్లా పౌర సరఫరాల అధికారి ( డి సి ఎస్ ఓ )లకు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, వారం రోజుల్లోగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి సన్నరకం ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అంది స్తున్నందున, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్. డైరెక్టర్ కరుణాకర్,వ్యవసాయ శాఖ అధికారులు ఆర్థిదారులు పాల్గొన్నారు..

**ఎన్టీఆర్‌కు నివాళి అర్పించిన వారధి ఫౌండేషన్**

# చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య

**ఎన్టీఆర్‌కి భారత రత్న ప్రకటించాలి అని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**తెలంగాణ గడ్డకి నిజమైన ప్రజాస్వామ్య పరిమళాలు అద్దింది ఎన్టీఆర్ పాలనే**

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఉమ్మడి రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటి చెప్పిన దివంగత నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకొని గురువారం వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని దేశ విదేశాలలో ఇనుమడింపజేసి



తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చిన అన్న ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తెలుగువారి ప్రతిష్ట పెరిగేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

**షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం.**

**ఎన్టీఆర్ ఓ యుగ పురుషుడు, ఆయనకు భారత రత్న పురస్కారం ఇవ్వాలి**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం శుభసూచకం.**

**కమ్మ సేవా సమితి డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ పరిధిలోని ఎంపీ శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ లో 103 వ జయంతి వేడుకలను షాద్ నగర్ కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు మాట్లాడుతూ.. తెలుగునేల పులకించి పోయే తెలుగు బిడ్డ, తెలుగు ప్రజలందరి చేత అన్నగారు అనిపిలిపించుకున్న మహానేత, దక్షిణ భారతదేశంలో పుట్టిన ముద్దుబిడ్డ చరిత్ర మరువని యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు అని తెలుగు నేల ఉన్నంత వరకూ ఆయన చిరస్మరణీయుడనీ, తెలుగు వారి సామాజిక రాజకీయ జీవనంలో ఎన్టీఆర్‌ది ఓ కీలక ఘట్టం అనీ ఆ మహానాయకుడి శత జయంతి ఉత్సవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో




ఘనంగా జరుపుకుంటున్నారనీ కొనియాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి ఆయన చేసిన గొప్ప సేవలను తెలుగు ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని కొనియాడారు. ఆయన ఆలోచనలు అజరామరం.. ఆయన నాయకత్వం అద్భుతాల నిలయం.. ఆయన దారి అనితరసాధ్యం.. అంటూ కీర్తించారు. భారతీయ సినిమాపైనే కాకుండా దేశ రాజకీయాల్లోనూ చెరగని ముద్రవేసి తనదైన చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించుకున్న మహనీయుడు ఎన్టీఆర్ అనీ, కృషి ఉంటే మనుషులు రుషులవుతారనే పదానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి చరిత్రలో యుగ పురుషుడిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ శత జయంతి అందరికీ పండగ లాంటిదని అన్నారు. ఆయనకు గౌరవ ప్రదమైన భారత రత్న పురస్కారం ఇవ్వాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం అమీర్పేట మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించటం సంతోషంగా ఉందని , కమ్మ సేవా సమితి తరుపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు బండారుపల్లి నాగేశ్వర రావు, కొర్రపాటి శ్రీనివాస్ రావు, పాతూరి సత్యనారాయణ, పినపాక ప్రభాకర్, గుదే వసంత రావు, పాతూరి బ్రహ్మయ్య, వట్టి కొండ ఎర్రయ్య, మక్కపాటి మల్లేశ్వర రావు, నువ్వుల నాగేశ్వరరావు, ఆలపాటి పూర్ణ, కొడాలి సురేష్, కృష్ణారావు, కిలారు సాంబయ్య, సంజీవ రావు, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, కట్టా అప్పారావు, గుదే మస్తాన్ రావు, మలినేని శ్రీను , కట్టా హరి, కొత్త ప్రభాకర్, కొర్రపాటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శ్రీనివాస్, యడ్ల శ్రీనివాస్ , కట్టా హరి, బొల్లినేని కోటేశ్వర్ రావు, పేరం అనిల్, కనుమూరి రమేష్, కొర్రపాటి వెంకట్రావు, ఆలూరి శ్రీనివాస్, బ్రహ్మయ్య చౌదరి, మాధవ రావు. బాలయ్య, వెంకటేశ్వర రావు. నువ్వుల నాగేశ్వర్రావు, నువ్వుల వెంకటేశ్వర రావు, శశి, పాతూరి రఘు, పాతూరి విద్యాసాగర్, మక్కపాటి సతీష్, సిరిపురపు వెంకటరమణ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చైతన్యం చేస్తూ రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలి

**బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి**

**నాగర్కర్నూల్ అక్షిత ప్రతినిధి:**

నాగర్ కర్నూల్ జిల్లాలో బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో అబ్బ కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా బీసీ పొలిటికల్ జేఏసీ ఉపాధ్యక్షుడిగా అబ్బ కరుణాకర్ ను , జిల్లా జనరల్ సెక్రెటరీ మహిళా విభాగం అబ్బ శిరీషను, బిజినపల్లి మండలం అధ్యక్షులు సంద,రమేష్ ముదిరాజ్ ను వీరిని కండువాలతో ఆహ్వానించి నియామక పత్రాలు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన మన బీసీల జనాభా శాత ఫలాలు అందకుండా కొన్ని సామాజిక వర్గాల కు చెందినవారు మాత్రమే రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా కానీ, ఉద్యోగాలలో ఇలా ఏ రంగాలలో చూసుకున్న కలిసికట్టుగా మనము లేకపోవడం వలన వాటిని సాధించుకోలేకపోతున్నాము అన్నారు. అందులో భాగంగానే కమిటీలు విస్తృతంగా వేసి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా పోరాటాలు చేయాలని, అదేవిధంగా ఓటు చైతన్యం చేస్తూ రాజ్యాధికారం సాధించుకునే దిశవైపు పని చేయాలని బీసీ



పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి అన్నారు.

ఈ సమావేశంలో బిసి పొలిటికల్ జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీవిద్య సితారాల మాట్లాడుతూ మహిళలకు జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ, విద్య ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా మరింత బలంగా తీర్చిదిద్దుతూ అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులుగా గెలిపించుకునే దిశగా బిసి పొలిటికల్ జేఏసీ గట్టిగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుక, అబ్బా కరుణాకర్ ముదిరాజ్, అబ్బా శిరీష కరుణాకర్, కుమ్మరి శ్రీశైలం, చాకలి వెంకటయ్య, లవ, రమేష్, రామచంద్రయ్య, మల్లేష్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
శుక్రవారం । 29 । మే । 2026

## కొనుగోళ్ల ప్రక్రియ ముగిసేవరకూ

# ఇదే చొరవతో పని చేయాలి

**జిల్లాలో వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు**

**తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగిసే వరకూ అధికారులు ఇదే చొరవతో పని చేస్తూ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ధాన్యం సేకరణ, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం, అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం కొనుగోలు కేంద్రాల వద్ద నుండి అపరల్ పార్క్ కు హమాలీలను తరలించడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందకుండా అధికారులు అవగాహన కల్పించి, ధాన్యం కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వారీగా ధాన్యం సేకరణ, అన్ లోడింగ్‌పై ఆరా తీసి, ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తయ్యే వరకు అధికారులు ఇదే చొరవతో పని చేయాలని, రాబోయే వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని అన్నారు.

కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతంచేయడం కోసం అపరల్ పార్క్‌కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు.

వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని ఆదేశించారు. మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# ధాన్యం నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి.

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి, నిల్వలను వెంటనే గోదాములకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.




ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు తీరును, నిల్వల పరిస్థితిని, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, ఇంకా ఎంత కొనుగోలు చేయాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు.

కొనుగోలు చేసిన ధాన్యపు సంచులను ఎప్పటికప్పుడు గోదాములకు, రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. రైస్ మిల్లుల సామర్థ్యం, ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే వాహనాలు నిలిచిపోకుండా వెంట వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేసి తిరిగి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అవసరమైతే అదనపు హమాలీలను నియమించుకోవాలని మిల్లుల నిర్వాహకులకు తెలిపారు. అలాగే మిల్లుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేసి గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గడువులోగా నిల్వలను గోదాములకు తరలించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం మెట్రిక్ టన్నుల వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఈ సందర్భంగా పెంచికల్‌పాడు గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ స్థలం ఉందని గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ తెలియజేయడంతో అక్కడ గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, కుంటాల తహసిల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్**

**ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**

**జగిత్యాల అక్షితబ్యూరో:** బక్రీద్‌ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ముస్లిం సోదర,సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జగిత్యాల, కోరుట్లలో గల పలు ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని పేర్కొన్నారు.



## వాక్కు స్వాతంత్రం రాజ్యాంగం కల్పించిన హక్కు

**ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఆంధ్ర పోలీసుల దాస్టికాన్ని ఖండిస్తున్నాం**

**పవన్ కళ్యాణ్ బేషరతుగా ప్రొఫెసర్‌కు క్షమాపణ చెప్పాలి**

**పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలి...లేకుంటే తెలంగాణలో తిరగనివ్వం**

**తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య**

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఏ విషయం పైన అయినా మాట్లాడే స్వాతంత్రం భారత రాజ్యాంగం కల్పించిందని ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల్లో ఎలాంటి తప్పులు లేవని తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య అన్నారు. ఒక మేధావిగా ఒక ప్రొఫెసర్ గా ఒక జర్నలిస్టుగా ఒక ఎనాలసిస్ట్ గా ప్రొఫెసర్ నాగేశ్వర్ కు ఉన్న సమాచారం మేరకే పవన్ కళ్యాణ్ విషయంపై మాట్లాడి ఉంటారని అందులో నిజం లేకపోతే మాట్లాడి ఉండరని సోమయ్య అన్నారు. అనేక అంశాలపై అనేక సందర్భాలలో తన అభిప్రాయాన్ని నాగేశ్వర్ వెల్లడించారని ఎన్నడు లేని విధంగా నేడు కావాలని ఆయన



మాటలను వక్రీకరించి ఆయనపై సోషల్ మీడియాలో దాడికి దిగుతున్నారని మేధావులను నివారించాలని చూస్తే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏ పార్టీకి చెందిన వ్యక్తి కాదని తన అభిప్రాయాలను ఉన్నది ఉన్నట్టుగా సైంటిఫిక్ గా వెల్లడి పరుస్తారని అలాంటి ఎనలిస్టులపై ఆంధ్ర సోషల్ మీడియా ఆంధ్ర నాయకులు దాడి చేస్తామంటే తెలంగాణ ప్రజానీకం ఊరుకోదని హెచ్చరించారు. నాగేశ్వర పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి భే షరతుగా క్షమాపణ చెప్పాలని సోమయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడిచిన ఇంకా వలసవాద ఆంధ్ర పాలకుల ఆధిపత్యం పోవడం లేదని ఇకనైనా మేధావులు విద్యార్థులు యావత్ తెలంగాణ ప్రజానీకం ఏకం కావాలని ఇలాంటి పెత్తందారులపై గళాన్ని వినిపించాలని సోమయ్య పిలుపునిచ్చారు.

# జీవన్మృతి అవయవదానంతో పలువురికి పునర్జీవం..!

### ప్రాణంతో మన మధ్య లేకున్నా సుప్రియ చిరంజీవి.!

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణంలోని వివాహిత అవయవ దానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు ప్రసరించి మానవత్వం చాటుకున్నది. వివరాల్లోకి వెళితే...



మే 24న ఆదివారం జగిత్యాల పట్టణం హనుమాన్ వాడ కు చెందిన అక్కపెల్లి ప్రవీణ్ సతీమణి సుప్రియ (25) అనే మహిళ స్కూటీ బండి నడిపించడం నేర్చుకునే క్రమంలో బండి పై నుండి ప్రమాదవశాత్తు పడి తలకు బలమైన గాయాలు కాగా, చికిత్స నిమిత్తంస్థానిక ఆసుపత్రికి తరలించారు.

వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాదులోని యశోద హాస్పిటల్‌కి తీసుకెళ్లాలని సూచించారు. గత మూడు రోజులుగా యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు కానీ ఆమె ఆరోగ్యం కుదుట పడక పోగా మరింత విషమంగా మారి బ్రెయిన్ డెడ్ (జీవన్మృతురాలు) అయిందని తాను తిరిగి కోల్కోవడం కష్టతరమని డాక్టర్లు నిర్ధారణ చేశారు.

గత మూడు రోజులుగా మృత్యువుతో పోరాడిన సుప్రియ గతరాత్రి తుది శ్వాస విడిచారు. దీనితో ఆమె భర్త అక్కపెల్లి ప్రవీణ్, కుటుంబ సభ్యులు మహిళ అవయవాలను స్వచందంగా దానం చేయడానికి ముందుకు రావడంతో, ఆసుపత్రి వైద్యులు జీవన్ దాన్ ప్రతినిధులతో మాట్లాడి అవయవ దానం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

దీనితో సుప్రియ శరీరంలోని ప్రధాన అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు, కళ్ళు, మూత్రపిండాలు, కాలేయంను జీవన్ దాన్ ప్రతినిధులు సేకరించినట్లు తెలిసింది. అనంతరం వారు మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఈ అవయవాలతో చాలా మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరింపజేసిందని సుప్రియను కొనియాడారు. ఆమెకు భర్త ఇద్దరు కూతుర్లు తేజశ్రీ (6), వైష్ణక (3) ఉన్నారు అతి చిన్న వయసులో ఇద్దరు పిల్లలని వీడి అనంత లోకాలకు వెళ్లిన సుప్రియ ఉదంతం తెలిసిన ప్రతి ఒక్కరు ఒక వైపు కొనియాడుతుంటే, మరో వైపు కుటుంబ సభ్యులు, ప్రాంత ప్రజలు చిన్న పిల్లలను చూసి కన్నీటి పర్యంతమౌతున్నారు. ఇక మరికొందరు పట్టణ ప్రముఖులు సుప్రియ చిరంజీవిగా మిగిలి పోయిందని ప్రశంసిస్తున్నారు.

# కోదాడలో మహానాడు విజయవంతం

### తెలంగాణలో సైకిల్‌కు పూర్వవైభవం ఖాయం.

### టిడిపి రాష్ట్ర నాయకులు ముత్తినేని సైదేశ్వర రావు

**కోదాడ అక్షిత ప్రతినిధి:** నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజులుగా కోదాడ పట్టణంలో వర్చువల్ పద్ధతిలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు గురువారం ముగిసింది. మహానాడు ఇన్చార్జ్‌లు ముత్తినేని సైదేశ్వరరావు, ఓరుగంటి ప్రభాకర్‌ల పర్యవేక్షణలో ఈ మహాసభలు విజయవంతమయ్యాయి. మహానాడు



ముగింపు సభలో ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న తెదేపా ముఖ్య నాయకులు, నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు, కార్య కర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి ఇన్చార్జ్‌లు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు నాయుడు వర్చువల్ సందేశం క్యాడర్‌లో సరికొత్త ఉత్తేజాన్ని నింపిందని, రాబోయే ఎన్నికలే లక్ష్యంగా తామంతా కలిసి కట్టుగా పనిచేస్తామని తెలిపారు. మహానాడు విజయ వంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం, సరికొత్త జోష్ నెలకొందన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ క్యాడర్ అంతా మునుపటి కంటే బలమైన సంకల్పంతో ఉందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్ కు పూర్వవైభవం రావడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో ముప్వా అరుణ్ కుమార్, చాగంటి వెంకటేశ్వరరావు,కోడె వాసు, భయ్యా నారాయణ, జనపనేని కృష్ణ,కొల్లు నరసయ్య, సాతులూరి గురవయ్య, బండ్లమూడి వెంకటేశ్వరరావు, గుండు నాగేశ్వరరావు, పిట్టల శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు

**రైతు సమస్యలను గాలికి వదిలేసి... గాలిలో సంచరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం...**

**రైతులు పండించిన పంటను రోడ్డుపై వేసి నిప్పంటించిన, చలించని రాష్ట్ర ప్రభుత్వం..**

**రైతు గోస యాత్ర కాదు... బీజేపీ పార్టీ ప్రచార యాత్ర...**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల మధ్యలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు...**

**స్థానిక ఎమ్మెల్యేకు రిబ్బన్ కటింగ్‌ల మీద ఉన్న శ్రద్ధ... పంట కొనుగోలు మీద లేదు..**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**

**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలసి రైతులను మోసం చేస్తున్నాయని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నాయ కులు గండ్ర వెంకటరమణా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలు అరిగోసలు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు..జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఆగమాగం ఉందని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మధ్య రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు..కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఎగుమతి కాక, ఎగుమతి అయిన ధాన్యం దిగుమతి కాక రైతులు అరిగోస పడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి గాలిలో తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు..

ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కూడా రైతులు రోడ్డు ఎక్కి నిరసన తెలిపే అద్వాన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. ఇంకో రెండు మూడు రోజులో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక చేస్తున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహారిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు..వర్షాలు పడి ధాన్యం తడిచే పరిస్థితి ఏర్పడితే తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు..రైతు గోస – బీజేపీ భరోసా యాత్ర అని మొదలు పెట్టిన రాష్ట్ర బిజెపి నాయకత్వం,రైతుల గోస వినాల్సింది పోయి హంగు ఆర్బాటాలు చేస్తున్నారన్నారు..ఇకనైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తో వ్యవహారించి రైతులకు న్యాయం చేయాలన్నారు..



### రైతులు పర్యావరణాన్ని రక్షించాలి

రైతులు మక్క పంటలు, వరి కోసిన తరువాత పంట పొలాలు కాలపెట్టడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని,కొన్ని సందర్భాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి ప్రాణాలు సైతం పోతున్నాయన్నారు. అన్నదాతలు పంట పొలాలను దగ్ధం చేయకుండా పర్యావరణాన్ని రక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు...అధికారులు కూడా రైతులు వరి కొయ్యలను తగలబెట్టకుండా అవగాహన కల్పించాలని అన్నారు..ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏదైన అత్యవసర పరిస్థితిలో తప్ప బయట తిరగొద్దని, ముఖ్యంగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గండ్ర వెంకట రమణా రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

# పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి

### - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్ కరీంనగర్ జిల్లా బిజెపి శ్రేణుల శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని



కరీంనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వేదికగా రెండు రోజులపాటు శిక్షణ తరగతులను ఘనంగా నిర్వహించడానికి, నిర్వహణ నిమిత్తం వివిధ విభాగాలకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం రోజున శిక్షణ తరగతుల వేదిక ప్రాంగణం వద్ద బిజెపి జిల్లా అధ్యక్షుడి గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నేతలతో, శిక్షణా తరగతుల కు సంబంధించి వివిధ విభాగాల బాధ్యులతో సన్నాక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ . భారతీయ జనతా పార్టీ సంస్థా గత నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి, పార్టీ శ్రేణులకు నాయకులకు కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించేందుకు పండిత్ దీన్ దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్ శిక్షణ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతావాదం, అంత్యోదయ చిట్ట చివరి వ్యక్తికి సంక్షేమం సిద్ధాంతాలపై అవగాహన కల్పించడం, పార్టీ కార్యకర్తలకు బూత్ నిర్వహణ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సోషల్ మీడియా, సంస్థాగత బాధ్యతలపై శిక్షణ అందించడంతోపాటు కార్యకర్తల్లో క్రమశిక్షణ దేశభక్తి సేవా భావాన్ని పెంపొందించే దిశలో, పార్టీ విస్తరణ కోసం కరీంనగర్ జిల్లాలో ఈనెల 30,31 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ముగింపు సమారోప్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ అపేక్షితులు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# మానకొండూర్ దర్గాలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ**

మానకొండూర్, అక్షిత న్యూస్: మానకొండూర్ మండల కేంద్రంలోని దర్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ముస్లిం సోదరులకు హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా దర్గాకు చేరుకున్న ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ కి ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, యువకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన దేశంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ అని పేర్కొన్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, ప్రేమ, మానవత్వం, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. అన్ని మతాల పండుగలు మన సంస్కృతిలో ఐక్యతకు ప్రతిబింబమని, పరస్పర గౌరవ భావనతో సమాజం ముందుకు సాగాలని సూచించారు. ప్రజల మధ్య సోదరభావం పెంపొందించడంలో ఇటువంటి పండుగలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు.బక్రీద్ సందర్భంగా మానకొండూర్ మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు "ఈద్ ముబారక్" తెలియజేసిన ఎమ్మెల్యే, ముస్లిం సోదరులు శాంతి, సామరస్యాలకు ప్రతీకలుగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. బక్రీద్ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాలు నింపాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.అలాగే ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, మైనార్టీ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ముస్లిం సోదరులు విద్య, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ యువత మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం ముస్లిం పెద్దలు, యువకులతో కలిసి పరస్పరం అలయ్ బలయ్ తీసుకుంటూ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దర్గాలో భక్తులతో కలిసి ఎమ్మెల్యే ఆప్యాయంగా ముచ్చటించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు ఇర్ఫాన్, మడుపు ప్రేమ్ కుమార్, నరేష్, కోంద్ర సురేష్, శంకర్, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీధర్, కనకం అశోక్, సహదేవ్ తోపాటు ముస్లిం పెద్దలు, యువ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగు మహాసభల సమన్వయకర్తగా సురేష్‌బాబు తోటమల్ల



భద్రాచలం అక్షిత న్యూస్: భద్రాచలం శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జూన్ 6 ,7 తేదీలలో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో నిర్వహించే 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సమన్వయకర్తగా భద్రాచలం పట్టణానికి చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి, కవిరత్న ,స్వర్ణ నంది గ్రహీత సురేష్‌బాబు, తోటమల్ల నియమితులయ్యారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం, జాతీయ ప్రణాళికాధికారి డా బి.పార్థసారథిలు ఈ మేరకు గురువారం నియామక పత్రం పంపించారు. తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని విశ్వ వ్యాప్తం చేయాలనే సంకల్పంతో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ సమన్వయకర్తగా నియమించటం పట్ల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ మహాసభల విజయవంతానికి కృషి చేస్తానని తెలిపారు.

# అర్హులందరికి ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి

**-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి..**

భద్రాచలం అక్షిత న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మీయ భరోసా పథకాన్ని అర్హులైన వ్యవసాయ కార్మికులందరికీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ మహాసభ మడకం పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రాచలం పట్టణం శివారు కాలనీల నుండి వందలాదిమంది పేదలు చుట్టుపక్క గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారని అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో వందలాది మందికి ఉపాధి కార్డులు ఉన్నప్పటికీ ప్రభుత్వం పనులు చూపించడం లేదని అన్నారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు చూపించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ పనులు చేసే వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా పథకం కింద ప్రభుత్వ హామీ మేరకు సంవత్సరానికి రూ, 12,000/-లు ఇవ్వాలని డిమాండ్ చేశారు..

**వి.బి. జి. రామ్ జి ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలి...**

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలే శరణ్యమని, వి.బి. జి, రామ్ ఉపాధి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, సిఐటియు జిల్లా నాయకులు ఎం,బి, నర్సారెడ్డి ప్రభుత్వ డిమాండ్ చేశారు..

వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ మహాసభలో ఆయన




ప్రసంగించారు.. బిజెపి సర్కార్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పులు చేసి వి.బి. జి. రామ్ జి ఉపాధి చట్టాన్ని తీసుకోవచ్చి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. కేంద్రంలోని బిజెపి అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అనంతరం, వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని 15 మంది సభ్యులతో ఎన్నుకోవడం జరిగింది. పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా గడ్డం స్వామి బుయ్యని సౌభాగ్యం ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా, మడకం పద్మ, గుండె రమాదేవి, సహాయ కార్యదర్శులుగా కాకా రాధ, బాయమ్మ లు తో పాటు కమిటీ సభ్యులుగా సీతా మహాలక్ష్మి, గోలి జయ సోడి రాజమ్మ కోడె వరలక్ష్మి బాయమ్మ నాగమ్మ సావిత్రి లు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్షులు డి సీతాలక్ష్మి, వార్డు మెంబర్ ఐరప అనసూయ,ఐద్వా సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి,గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజ శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్ ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవీందర్, సిఐటియు నాయకులు చాట్ల శ్రీనివాస్ రాఘవయ్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు

**వర్షానికి తడిసిన 10 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లుకు తరలింపు**

**అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు**

రాజన్న సిరిసిల్ల, అక్షిత: తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని అధికార యంత్రాంగం భరోసా ఇస్తుంది. అకాల వర్షాలకు తడిసిన వెంటనే ధాన్యం రైస్ మిల్లుకు తరలించి రైతాంగానికి భరోసా ఇచ్చింది. జిల్లాలో అకాల వర్షం కురిసి ముస్తాబాద్ మండలం పోతుగల్ లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనతో ఐకేపీ, పౌర సరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రానికి చేరుకొని దాదాపు 10 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని వెంటనే నామాపూర్ గ్రామంలోని బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ కు తరలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసి భరోసా కల్పించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేస్తున్నామని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.





